క్లుప్తంగా

వెంకన్న హుండీ ఆదాయం రూ.3.55 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పాజుల్‌బాగ్‌పేట నారాయణ తిరుమల కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.3,55,841 వచ్చిందని ఈఓ శ్యామలరావు తెలిపారు. మంగళవారం ఆలయ ట్రస్టు సభ్యులు, దేవదాయశాఖ ఈఓ సుకన్య పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించినట్లు చెప్పారు. 113 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

కాలువ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జి.సిగడాం: మెట్టవలసలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ కాలువ పనులను ఎంపీడీఓ రామకృష్ణారావు, సర్పంచ్ కామొజుల ఆరుద్ర, జి.సిగడాం సహకార సంఘం చైర్మన్ బెవర జగన్నాధరావు మంగళవారం పరిశీలించారు. డ్వామా పీడీ సుధాకర్ ఆదేశాల మేరకు పనులు చేస్తున్నామని ఏపీఓ చోళ్ల సత్యనారాయణ తెలిపారు.

హిందీ టీచర్‌కు సన్మానం



ఉమాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: కరిమెల్లపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హిందీ పక్షోత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు డి.పార్వతీశం హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం హిందీ భాషా పండితురాలు ఉమాదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసిరితల్లికి విశేష పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

గార: కళింగపట్నం పంచాయతీ నగరాలపేట, తాన్‌సాహెబ్‌పేట గ్రామదేవత అసిరితల్లికి మంగళవారం వారాల పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల కోలాట ప్రదర్శన అలరించింది.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు పిలుపునిచ్చారు. మునసబుపేటలోని గాయత్రీ కళాశాలలో మంగళవారం జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో రిమ్స్, లయన్స్, రెడ్‌క్రాస్ సంస్థల సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రిమ్స్ మెడికల్ కళాశాల అధికారి డాక్టర్ శ్యామల, కరస్పాండెంట్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాయకులుగా యువత



తమ్మినేని ఉషారాణిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం యువతను, విద్యార్థులను బావితర ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దుతామని, జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకరరావు అన్నారు. నగరంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో జేసీఐ వీక్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జేసీఐ వారోత్సవాల్లో భాగమైన ప్రతీసభ్యునికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, మెంటార్ కె.వి.రావు, గొంప సురేష్, బి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు వేళాయె..!

- నేటి నుంచి విశ్వకర్మ జయంతి ఉత్సవాలు
- ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



విశ్వకర్మ విగ్రహం



గోవిందపురంలోని విశ్వకర్మ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం

శ్రీకాకుళం కల్చరల్ : సకల కళలకు ఆదిదేవుడు, దేవ లోకాలను నిర్మించిన వాస్తు శిల్పిగా పేరుగాంచిన విశ్వకర్మ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాకుళం నగరంలో ఈ నెల 17 నుంచి 21 వరకు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించేందుకు ఆయా కమిటీల ప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. విశ్వకర్మను బ్రహ్మదేవుని కుమారునిగా పురాణాలు చెబుతున్నాయి. సకల కళలకు ఆదిదేవుడు. దేవాది లోకాలను నిర్మించిన స్తపతి. దేవతలకు ఆకాశమార్గాన విహరించే పుష్పక విమానాన్ని, ఆభరణాలను, ఆయుధాలను తయారు చేసిన శిల్పి. నాలుగు ముఖాలు, ఎనిమిది చేతులలో పనిముట్లు, ఆయుధాలు కలిగి ఉంటారు. సత్యయుగంలో ఇంద్రుడు పరిపాలించే ఇంద్రలోకం, త్రేతాయుగంలో స్వర్ణ లంక, ద్వాపర యుగంలో ద్వారకా నగరం, కలియుగంలో హస్తినాపురం, ఇంద్రప్రస్థాన్ని నిర్మించిన గొప్పవ్యక్తిగా విశ్వకర్మ కీర్తించబడుతున్నారు.

రాష్ట్ర పండుగగా..

విశ్వకర్మ జయంతిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ మేరకు రెండేళ్ల కిందట జీఓ 24 విడుదల చేసింది. ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. విశ్వకర్మ నిర్మాణ శిల్పి కావడం వల్ల భక్తి సూచకంగా విశ్వకర్మ జయంతి నాడు సాంకేతిక నిపుణులు, వివిధ వృత్తుల వారు, పరిశ్రమలవారు వారి పరికరాలను పూజిస్తారు. పట్టణంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

నగరంలోని పలు చోట్ల విశ్వకర్మ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. చంపాగల్లివీధిలోని శ్రీకంచి కామాక్షి దేవి శ్రీకాకుళం పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. ఇందుకోసం జి.టి.రోడ్డులో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం మండలంలోని చాపురం పంచాయతీ గోవిందపురం గ్రామంలో చలపాక సూర్యారావు తన తండ్రి జ్ఞాపకార్థం విశ్వకర్మ గార్డెన్ నిర్మించారు. ఈయన వంశధార జలవనరుల శాఖలో ఇంజినీర్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం తండ్రి నారాయణ ఆచారి కోరిక మేరకు గార్డెన్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. బలగ తదితర ప్రాంతాల్లోనూ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

రోజుకో వేడుక..

17న ఉదయం విశ్వకర్మ విగ్రహం గ్రామప్రదక్షిణ, 18న సహస్ర పత్రి పూజ, గణపతి హోమం, 19న గాయత్రిదేవి, లలితా సహస్రనామ కుంకుమార్చనలు, లక్ష దీపారాధనలు, 20న రుద్రహోమం, రుద్రాభిషేకాలు, 21న విశ్వకర్మ పంచసూక్త హోమం, పూర్ణాహుతి, 22న అన్నప్రసాద వితరణ, మహాలడ్డూ వేలంపాట, 24న స్వామివారి నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇతర రాష్ట్రాల్లోనూ..



తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా వంటి ఇతర రాష్ట్రాల్లోనూ విశ్వకర్మ జయంతిని గొప్పగా నిర్వహిస్తారు. విశ్వకర్మ జయంతిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పండుగగా గుర్తించడం సంతోషంగా ఉంది. ఎవరూ చేయలేని పనిని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. వేడుకలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నాం.

– సోపింటి తారకేశ్వరరావు, అధ్యక్షుడు, పట్టణ స్వర్ణకార సంఘం, శ్రీకాకుళం

దేవలోక నిర్మాణ కర్త..



మహానుభావుడైన విశ్వకర్మకు జయంతి సందర్భంగా మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలలోనూ ఘనంగా వేడుకలు చేస్తారు. దేవలోక శిల్పిగా విశ్వకర్మ ఎంతో ఖ్యాతి గడించారు. వేడుకలను అందరూ విజయవంతం చేయాలి.

– చలపాక సూర్యారావు, విశ్రాంత ఇంజినీర్, శ్రీకాకుళం



పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు

ఉమ్మడి సీనియారిటీ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

గార: పదోన్నతుల్లో ఉమ్మడి సీనియారిటీ అమలు చేయకుండా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి మండిపడ్డారు. మంగళవారం గార మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బూరవెల్లి, గార, వమరవల్లి, కళింగపట్నం పాఠశాలలను సందర్శించారు. అనంతరం కళింగపట్నం జెడ్పీ స్కూల్లో ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ కోర్టు కేసులు పేరిట ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయకుండా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం సరికాదన్నారు. ఎంఈఓ-1 పోస్టులు ఖాళీ చోట ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే హెడ్‌మాస్టర్లు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను వేసి పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల హక్కులకు తూట్లు పొడుస్తూ అధికారులు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు కె.గడ్డెన్నాయుడు, ఎం.తేజేశ్వరరావు, బి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పాఠ్యాంశాల్లో మార్పులు తప్పనిసరి



మాట్లాడుతున్న వీసీ కె.ఆర్.రజిని

ఎచ్చెర్ల: విద్యార్థులకు కెరీర్ పరంగా ఉజ్వల భవిత అందేలా డిగ్రీ కోర్సుల పాఠ్యాంశాల్లో మార్పులు రావాలని డాక్టర్ బి.ఆర్.ఎ.యు.వర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని అన్నారు. బీఆర్ఏయూ అనుబంధ డిగ్రీ కళాశాలలకు చెందిన యూజీ కోర్సుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం డిగ్రీ స్థాయి అభ్యాసన అంశంలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, క్వాంటమ్ సంబంధిత అంశాలకు బోధనాంశాల్లో ప్రాధాన్యతనివ్వాలన్నారు.వర్సిటీ అకాడమీ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని మాట్లాడుతూ ఏఐ మెషిన్ మెర్నింగ్ కమ్యూనిటీ సర్వీసెస్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్ వంటి అంశాలపై డిగ్రీ సబ్జెక్టులలో తప్పనిసరిగా ఉండేలా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీడీసీ డీన్ ఎస్.ఉదయ భాస్కర్, యూజీ పరీక్షలు డీన్ డాక్టర్ పద్మారావు, అసిస్టెంట్ డీన్ ఉదయకుమార్, పూర్వ రిజిస్ట్రార్ టి.కామరాజు, సామ్రాజ్యలక్ష్మీ, 14 బోర్డుల యూజీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలను అధిరోహించాలి



సింగూరు ప్రవీణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ ఆధ్వర్యంలో గ్రాటిట్యూడ్ అండ్ సెలబ్రేషన్ డే మంగళవారం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సింగూరు ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేష్, కోఆర్డినేటర్లను సత్కరించారు. జేసీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందీభాషపై పట్టు సాధించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో మంగళవారం హిందీ దినోత్సవం నిర్వహించారు. హిందీ విభాగం లెక్చరర్ పి.పార్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్, హిందీ అధ్యాపకులు విశ్వేశ్వర వర్మ భూపతి రాజు మాట్లాడుతూ హిందీ భాషపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

వివాహిత నిరసన

రణస్థలం: ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని ఓ వివాహిత మంగళవారం లావేరు మండలం చిగురుకొత్తపల్లిలో నిరసన వ్యక్తం చేసింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఎండా మంగమ్మకు లావేరు మండలం కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. తర్వాత చిగిరికొత్తపల్లికి చెందిన యర్ర శంకర్ అనే యువకుడితో మంగమ్మకు 2019లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడటంతో భర్తకు విడాకులు ఇచ్చింది. శంకర్‌ను వివాహం చేసుకుని హైదరాబాద్ వెళ్లిపోయింది. శంకర్ హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేసేవాడు. అక్కడి నుంచి పైడిభీమవరం వచ్చి కొన్నాళ్లుగా నివాసం ఉంటున్నారు. కొన్ని నెలల క్రితం శంకర్ ఇంటి నుండి వెళ్లిపోవడంతో మంగమ్మ లావేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి హైదరాబాద్‌లో ఉంటున్న శంకర్‌ను తీసుకుని వచ్చి మంగమ్మతో కలిసి ఉండాలని సూచించారు. శంకర్ పది రోజుల క్రితం మళ్లీ వెళ్లిపోవడంతో మంగమ్మ చిగురుకొత్తపల్లిలో శంకర్ ఇంటి వద్దకు చేరుకుని తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం నిరసన వ్యక్తం చేసింది.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న పర్యావరణ ఇంజినీర్ కరుణశ్రీ

శ్రీకాకుళం న్యూకాలనీ: మనతో పాటు భవిష్యత్ తరాల మేలు కోసం ప్రతి ఒక్కరు పర్యావరణ హితం కోసం పాటుపడాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో రసాయన శాస్త్రం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సంయుక్తంగా మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ బి.కరుణశ్రీ, ఏయూ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ బీవీవీ శైలజ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, అకడమిక్ కోఆర్డినేటర్ కె.మానిక, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సీఓఈ టి.ఆదిలక్ష్మి, కెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ పి.సూర్యసునీత, సీహెచ్ చాందిని, పి.కీర్తి, ఎస్.గీతాకుమారి, ఎం.రోహిణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 27న ఆన్‌లైన్‌లో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 28న ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 29న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

వెబ్ ఆప్షన్లలో ఆర్గానిక్ కెమిస్ట్రీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీపీజీసెట్-2025 అడ్మిషన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యల కారణంగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్, శ్రీకాకుళం (కళాశాల కోడ్: జీడీఎంఎస్)లోని ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సు మహిళా అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లలో ఇదివరకు కనిపించలేదని.. సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుషులతోపాటు మహిళా విద్యార్థులు వెబ్ ఆప్షన్లలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సును ఎంచుకోవచ్చని సూచించారు.

వర్క్‌షాప్ ప్రారంభం



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ గౌతమ్‌కుమార్

ఎచ్చెర్ల : స్థానిక వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై ఏపీ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ అకాడమీ, నాంది ఫౌండేషన్ సహకారంతో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్లు గౌతమ్‌కుమార్, ఈశ్వరరావులు హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు, డాక్టర్ కె.సత్యం, ఎస్.భాస్కర్, రాజు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో యువకులకు జైలుశిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ద్విచక్ర వాహనం చోరీ కేసులో అరెస్టయిన నిందితులు ధమరసింగి అఖిల్‌సాయి, దువ్వ భానుప్రసాద్‌లకు కోర్టు సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించిందని ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఈ ఏడాది మార్చి 3న ఇరువురిపై కేసు నమోదు కాగా అదే నెల 18న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. నేరారోపణ రుజువుకావడంతో తీర్పు వెలువడిందన్నారు.

ఆకట్టుకున్న ఓజోన్ ఆకృతి



అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం బలగ సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఓజోన్ ఆకృతిలో ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చిత్ర లేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం

ఉత్సాహంగా టెక్నోత్సవ్-2025



ప్రాజెక్టులను తిలకిస్తున్న వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నోత్సవ్-2025 మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐ బూట్ క్యాంప్ హ్యాక్‌తాన్ యూనిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతోంది. విద్యార్థుల్లో సాంకేతిక అభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన యూనిక్స్ క్లబ్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.రజనీ ప్రారంభించగా రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ఎస్‌పీఏఆర్‌సీ ఫౌండేషన్ చైర్మన్ సాయి సందీప్, సైబర్ క్రైం సెక్యూరిటీ అడ్వైజర్ నిపుణులు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సభ్యులు పాల్గొన్నారు. సుమారు 70 మంది విద్యార్థులు ప్రాజెక్టులు ప్రదర్శించారు. విజేతలకు ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు బహుమతులు అందజేశారు.

హోరాహోరీగా స్కూల్‌గేమ్స్ పోటీలు



చెస్ పోటీల్లో బాలికలు



యోగాసనాల్లో నిమగ్నమైన విద్యార్థినులు



వర్షపునీటి పక్కనే ఖోఖో ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్కూల్ గేమ్స్ డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా మొదలయ్యాయి. శ్రీకాకుళంలో మంగళవారం బాలికలకు ఎంపికలు నిర్వహించారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు స్థానిక ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో, బాడ్మింటన్ పోటీలు శాంతినగర్‌కాలనీలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో, యోగా పోటీలు కేఆర్ స్టేడియం బిల్డింగ్‌లో, చెస్ పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. పీఈటీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, మీట్ ఇన్‌చార్జి కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ మహిళా సెక్రటరీ ఆర్.స్వాతి, సంపతిరావు సూరిబాబు, పీడీ-పీఈటీ సంఘ జిల్లా టెక్నికల్ కన్వీనర్ ఎం.ఆనంద్‌కిరణ్, సతీష్‌రాయుడు, గురుగుబెల్లి రాజశేఖర్, పురుషోత్తం, సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు, రెడ్డి రవి, తదితరులు పాల్గొన్నారు. బుధవారం బాలురుకు ఎంపిక పోటీలు జరగనున్నాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బాలికలకు సైకిళ్లు పంపిణీ



: సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో నిర్వాహకులు

శ్రీకాకుళం: ఆడపిల్లల భవిష్యత్తుకు వసుధైక కుటుంబం భరోసాగా ఉండడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు అన్నారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని స్కౌట్స్ అండ్ గైడ్స్ సెమినార్ హాల్లో వసుధైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 55 మంది విద్యార్థినులకు ఉపకార వేతనాలు, సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు విజయనగరం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త పూజారి హరిప్రసన్న, ఉపవిద్యాశాఖాధికారులు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్, డీసీసీబీ సెక్రటరీ సంజీవరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ నల్లా కుమారస్వామి, ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, వాసుదేవరావు, ఎంఈఓలు సుజాత, కృష్ణ, దాలినాయుడు, వాగ్దేవి, స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ గెడ్డాపు రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల వేతనం పెంచాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్(డ్రైవర్లు)లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.బసవరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దేవీప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.దశరథరావు, కోశాధికారులు ఎం.మణికంత, ఎల్.రాంబాబు, కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, పి.వెంకటరావు, పి.అనంత్, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన

జి.సిగడాం: మండలంలోని రైతుసేవా కేంద్రాలతో పాటు ఎరువుల షాపుల్లో ఈ-పాస్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ మహాదేవు సరిత తెలిపారు. మంగళవారం పలు దుకాణాలను సందర్శించి ఎరువుల రికార్డులను పరిశీలించారు